## క్లుప్తంగా

### రేపు ప్రముఖ వైద్య నిపుణుల రాక

**పులివెందుల :** పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ క్రాంతికుమార్ మెదడు, వెన్నముక, నరాలు, తిమ్మిర్లు, వంటి, ఒళ్లు నొప్పులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ వైద్యులు డాక్టర్ డి.వి.నారాయణరెడ్డి ఆసుపత్రిలో 24 గంటలు అందుబాటులో ఉండి ఎండోస్కోపీ, కోలోనోస్కోపీ, అన్ని జీర్ణకోశ, లివర్, ప్యాంక్రియాస్ క్యాన్సర్‌లకు ఆపరేషన్లు చేస్తారన్నారు. అలాగే డాక్టర్ హర్షవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత షుగర్ పరీక్షలు నిర్వహిస్తున్నారని, పరీక్ష చేయించుకునే వారు పరగడుపున ఏమి తినకుండా రావాలన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

### డిపాజిట్లపై అత్యధిక వడ్డీ చెల్లిస్తాం

**కమలాపురం :** తమ బ్యాంకులో చేసే డిపాజిట్లపై అత్యధిక వడ్డీ చెల్లిస్తామని డీసీసీబీ మేనేజర్ సుధీర్ కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన తన ఛాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. తమ బ్యాంకులో డిపాజిట్ చేసే నగదుకు ఇతర బ్యాంకుల కన్న అత్యధిక వడ్డీ చెల్లిస్తామన్నారు. సీనియర్ సిటిజన్లకు 8 శాతం, ఇతరులకు 7.5 శాతం వడ్డీ చెల్లిస్తామన్నారు. అలాగే తమ బ్యాంక్ ద్వారా అన్ని వర్గాల ప్రజలకు అన్ని రకాల రుణాలు అందిస్తామని ఈ అవకాశాన్ని మండల ప్రజలు, ఖాతాదారులు వినియోగించుకోవాలని ఆయన తెలిపారు.

### 'జగనన్న ఆరోగ్య సురక్ష'ను విజయవంతం చేయండి

**సింహాద్రిపురం :** జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే కార్యక్రమాన్ని ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, వలంటీర్లు, ఏఎన్ఎంలు విజయవంతం చేయాలని ఎంపీడీవో కృష్ణమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేలను ఆయా గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి సర్వే చేసి ఆరోగ్య వివరాలు సేకరించాలన్నారు. అలాగే ఆరోగ్యశ్రీ యాప్ ఇంటిలోని ప్రతి ఒక్కరి మొబైల్‌లో డౌన్లోడ్ చేయాలని తెలిపారు. ప్రజా ప్రతినిధులు కూడా ఈ సర్వేలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

### ఓటు నమోదు నిరంతర ప్రక్రియ



మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసులు

**జమ్మలమడుగు రూరల్ :** ఓటు నమోదు నిరంతర ప్రక్రియ కావున 18 సంవత్సరాలు నిండిన యువతి, యువకులు తమ ఓటు హక్కును స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో, లేదా ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవచ్చునని జమ్మలమడుగు ఆర్డీఓ జి.శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఆయన ఛాంబర్‌లో రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలసి సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. డివిజన్ పరిధిలో చనిపోయినవారి ఓట్లు, అలాగే వివాహం చేసుకుని వెళ్లిన వారి ఓట్లను తొలగించాలన్నారు. అలాగే 27 పోలింగ్ కేంద్రాల పేర్లను మార్చామన్నారు.

### స్వచ్ఛ సర్వేక్షన్



ఆర్టీసీ బస్టాండు ఆవరణలో శుభ్రత కార్యక్రమంలో చైర్మన్ వరప్రసాద్ తదితరులు

**పులివెందుల టౌన్ :** స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక ఆర్టీసీ బస్టాండు ఆవరణలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హఫీజుల్లా, కమిషనర్ నరసింహారెడ్డిలతో కలసి శుభ్రతా కార్యక్రమాలను చేపట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రవేశ పెట్టిన స్వచ్ఛ సర్వేక్షన్-2023, ఇండియన్ స్వచ్ఛత, లీగ్ కార్యక్రమాల్లో భాగంగా ప్రయాణికులకు స్వచ్ఛత సర్వేక్షన్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీధర్, కౌన్సిలర్లు పార్నపల్లె కిషోర్, గంగాలక్ష్మి, పద్మావతి, షాహిదా తదితరులు పాల్గొన్నారు.

### ఒకే సంఘానికే పరిమితం కావాలి

**కడప కల్చరల్:** ఆంధ్ర ప్రదేశ్ ఎన్జీఓ సహకార గృహ నిర్మాణ సంస్థ సభ్యులు ఒకే సంఘానికి పరిమితం కావాలని, కొందరు రెండు సంఘాల్లో సభ్యత్వం తీసుకోవడం తగదని వైఎస్సార్ జిల్లా ఎన్జీఓ సహకార గృహ నిర్మాణ సంఘం అధ్యక్షుడు ఎల్.కొండారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో ఎన్జీఓ గృహ నిర్మాణ సంస్థ కార్యకలాపాలు సాగిస్తోందన్నారు. సొంత ఇల్లు లేకపోతే సహకార గృహ నిర్మాణ సంఘంలో సభ్యత్వం తీసుకుని లబ్ధి పొందవచ్చని తెలిపారు.

# ఘనంగా వినాయకుడి నిమజ్జన వేడుకలు

**వేముల :** మండలంలోని వేముల, కొత్తపల్లె గ్రామాల్లో శుక్రవారం నిమజ్జన వేడుకలు ఘనంగా జరిగాయి. కమిటీల ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించి శుక్రవారం గణనాథుని డప్పువాయిద్యాలతో ఆనందోత్సాహాల మధ్య నిమజ్జనానికి తరలించారు.

**రూ.1.42 లక్షలు పలికిన వినాయకుని లడ్డు**

వేములలో వినాయక ప్రతిమ వద్ద ఏర్పాటు చేసిన లడ్డు రూ.1.42 లక్షలు పలికింది. నిమజ్జనం రోజు లడ్డు వేలం పాట నిర్వహించారు. ఈ వేలంపాటలో వేములకు చెందిన చందా రమేష్‌రెడ్డి రూ.1.42 లక్షలు వేలం పాడి లడ్డును దక్కించుకున్నారు. అలాగే వేములకు చెందిన రామలింగారెడ్డి భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. గణనాథుని నిమజ్జనం రోజు నిర్వహించిన చెక్కభజన, కోలాటం భక్తులను ఆకట్టుకున్నాయి.

**పులివెందులలో..**

**పులివెందుల రూరల్ :** మండల పరిధిలోని పలు గ్రామాల్లో వినాయకచవితి వేడుకలను ఐదు రోజుల పాటు ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు రంగులు చల్లుకుంటూ, బాణాసంచా పేలుస్తూ డప్పు వాయిద్యాల మధ్య బొజ్జగణపయ్యకు ఘనంగా వీడ్కోలు పలికారు.

**పులివెందుల టౌన్ :** పట్టణ ప్రజలు వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఐదు రోజులుగా వినాయకుని పూజలు నిర్వహించి శుక్రవారం నిమజ్జనానికి తరలించారు. రంగులు చల్లుకుంటూ గణపతి బప్ప మోరియా అంటూ నినాదాలు చేస్తు గ్రామోత్సవం నిర్వహించారు. మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని చిందులు వేస్తూ నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు.

**ఎర్రగుంట్లలో..**

**ఎర్రగుంట్ల :** వినాయకుడి విగ్రహాలకు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించి శుక్రవారం నిమజ్జనంకు తరలించారు. మండల పరిధిలోని కదిరివారిపల్లెలోని యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహాన్ని, అలాగే శాంతినగర్‌కాలనీలో ఏర్పాటు చేసిన విగ్రహంను నిమజ్జనంకు తరలించారు.

**జమ్మలమడుగులో..**

**జమ్మలమడుగు :** పట్టణంలో గణనాథుల విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. లడ్డులకు వేలం పాటను నిర్వహించగా వాటిని దక్కించుకునేందుకు పోటీపడ్డారు. మరి కొన్ని విగ్రహాలను 9 రోజులకు, 11 రోజులకు నిమజ్జనం చేయనున్నారు. సీఐ సదాశివయ్య, ఎస్ఐ సుబ్బారావు లు ప్రత్యేక చర్యలను చేపట్టారు.

**జమ్మలమడుగు రూరల్ :** వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని పలుచోట్ల మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. చిన్నారులతో సాంస్కృతిక పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. భక్తులకు అన్నదానం, స్వామి ప్రసాదలను పంపిణీ చేశారు.



పులివెందులలో నిమజ్జనానికి తరలివెళ్తున్న బొజ్జగణపయ్య



జమ్మలమడుగులో వినాయకుడి విగ్రహం ఊరేగింపు



ఎర్రగుంట్ల : కదిరివారిపల్లెలో వినాయకుడిని నిమజనానికి తరలిస్తున్న యువకులు



నిమజ్జనం సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్న నిర్వాహకులు

### ఆయుష్మాన్‌భవపై అవగాహన

**చెన్నూరు :** సేవా పక్వడా కార్యక్రమంలో భాగంగా భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రజా ఆరోగ్య సంక్షేమం కోసం సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు ఆయుష్మాన్‌భవ కార్యక్రమంలో భాగంగా సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సతీష్‌కుమార్ స్థానిక ఆరోగ్య కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. ఆయుష్మాన్ భవ సేవా పక్వాడ కార్యక్రమంపై ప్రజలలో అవగాహన, అలాగే రక్తదానం, అవయవ దానం, ప్రాథమిక ఆరోగ్య సమస్యలు వంటి వాటిపై వారు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్, డాక్టర్లు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు

### దహన సంస్కారాలకు ఆర్థిక సాయం

**చెన్నూరు :** స్థానిక తూర్పు దళితవాడ కాలనీకి చెందిన మాజీ ఎంపీటీసీ ముద్ది రామలక్ష్మమ్మ గురువారం మృతి చెందారు. ఈ సమాచారాన్ని తెలుసుకున్న వైఎస్ఆర్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుమ్మా రాజేంద్రప్రసాద్‌రెడ్డి మృతురాలి కుటుంబానికి పోచమరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.5 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

### సౌకర్యాలను కల్పించాలని వినతి

**ఎర్రగుంట్ల :** స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో ఉండే రాణీవనం వాసులకు, రైల్వేప్రయాణీకులకు రైల్వేస్టేషన్‌లో సౌకర్యాలను కల్పించాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ద్వారా ఇచ్చిన వినతిపత్రాన్ని రాణీవనం వాసులు మాడిశెట్టి శివ, నాగరాజులు శుక్రవారం సికింద్రాబాద్‌లోని దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ అధికారి సీహెచ్ రాఖేష్‌కు అందించి వారి సమస్యలను తెలియజేశారు.

# పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

**పులివెందుల రూరల్ :** పౌష్టికాహారంతోనే గర్భిణులు ఆరోగ్యంగా ఉంటారని అంగన్‌వాడీ టీచర్లు పద్మావతి, వసంతలు తెలిపారు. శుక్రవారం భాకరాపురం సచివాలయ పరిధిలోని మూడు కేంద్రాలలో గర్భిణులకు, బాలింతలకు, తల్లులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించి, వారికి పౌష్టికాహారం పంపిణీ చేశారు.

**చెన్నూరు :** స్థానిక నాగలకట్ట వీధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం గర్భిణులకు, బాలింతలకు సీకేదిన్నె ప్రాజెక్టు అధికారి రమాదేవి అవగాహన కల్పించారు. రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలలో భాగంగా గర్భిణులు, బాలింతలు ఆకుకూరలను, కూరగాయలను, పండ్లు, పాలు, ఐరన్ మాత్రలు ప్రతి రోజు, క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

**వీరపునాయునిపల్లె :** రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయలక్ష్మి అన్నారు. పోషణ మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని 1వ అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారాల గురించి ఆమె అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మంచి పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. పిల్లలను క్రమం తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని తల్లులకు సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

**జమ్మలమడుగు :** పట్టణంలోని వెంకటేశ్వర కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారోత్సవాన్ని గూడెంచెరువు క్లస్టర్ సూపర్‌వైజర్ సునిత నిర్వహించి మాట్లాడారు. అంగన్‌వాడీ కార్యకర్తలు గర్భిణులకు, బాలింతలకు ఎప్పటికప్పుడు ఆరోగ్య సూత్రాలు పాటించడంతో పాటు మంచి పౌష్టికాహారం తీసుకునేవిధంగా సూచనలు సలహాలు ఇవ్వాలన్నారు.



చెన్నూరులో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

### సీఐగా బాధ్యతలు చేపట్టిన చాంద్‌బాషా



**వేంపల్లె :** స్థానిక సీఐగా ఎస్.కె.చాంద్‌బాషా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేకదృష్టి సారిస్తామన్నారు. శాంతిభద్రతల విషయంలో రాజీ లేకుండా పనిచేస్తామన్నారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ వెంకటేశ్వర్లు కదిరి రూరల్‌కు బదిలీ అయ్యారు. ఆ స్థానంలో పామిడి ఎస్ఐగా విధులు నిర్వహిస్తూ ప్రమోషన్‌పై వేంపల్లె సీఐగా చాంద్‌బాషా బాధ్యతలు చేపట్టారు. ఎస్ఐ తిరుపాల్‌నాయక్, సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు.

### ఒంటిగారిపల్లెలో జేసీ పర్యటన



గ్రామస్తులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్

**ముద్దనూరు :** వామికొండ రిజర్వాయర్ నుంచి లీకేజీ నీటితో ఇబ్బంది పడుతున్న ఒంటిగారిపల్లె వాసులతో జిల్లా జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ శుక్రవారం చర్చించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ వామికొండ జలాశయం నుంచి గ్రామంలోకి ఊట నీరు చేరుతుండటంతో అంటువ్యాధులు ప్రబలుతున్నాయని, అలాగే గ్రామంలో అధికంగా విషపురుగుల సంచారంతో భయాందోళనకు గురవుతున్నామన్నారు. తమ గ్రామాన్ని ముంపు గ్రామంగా ప్రకటించాలని గ్రామస్తులు జేసీకి విన్నవించారు. జేసీ గ్రామస్తుల సమస్యలన్నింటినీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తామన్నారు.

# యువకులచే బండలాగుడు పోటీలు

**వల్లూరు :** స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో వల్లూరు రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం వద్ద ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలను పురస్కరించుకుని యువకులచే బండ లాగుడు పోటీలను నిర్వహించారు. పలువురు యువకులు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇందులో ఈశ్వర్‌రెడ్డి, శివ ప్రసాద్ కలిసి 755 అడుగులు బండను లాగి మొదటి స్థానంలో నిలిచి రూ 3,116 గెలుచుకున్నారు. రామమోహన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి కలిసి 669.5 అడుగులు బండను లాగి ద్వితీయ స్థానంలో నిలిచి రూ 2,116 గెలుచుకున్నారు. రామాంజనేయ రెడ్డి, శ్రీను కలిసి 653.1 అడుగులు బండను లాగి మూడవ స్థానంలో నిలిచి రూ 1,116 గెలుచుకున్నారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వీరికి బహుమతులను అందచేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు విశ్వనాథరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, సుబ్బరామిరెడ్డి, సురేష్‌రెడ్డి, జోగిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, యల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బండలాగుడు పోటీల్లో బండను లాగుతున్న యువకులు

# రబీ సీజన్‌కు ఎరువులు సిద్ధం

**కమలాపురం :** మండలంలో రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతు కోసం ఎరువులు అన్ని ఆర్‌బీకేల్లో సిద్ధంగా ఉంచినట్లు ఏఓ సరస్వతి తెలిపారు. శుక్రవారం ఆమె మండలంలోని పలు ఆర్‌బీకేలో నిల్వ ఉంచిన ఎరువులను పరిశీలించి మట్లాడారు. డీఏపీ 56 మెట్రిక్ టన్నులు, యూరియా 43.2 టన్నులు, 20-20-0-13 ఎరువులు 23.5 టన్నులు 14-35-15 ఎరువులు 5 టన్నులు అందుబాటులో ఉన్నాయని ఆమె తెలిపారు. కావలసిన రైతులు ఆర్‌బీకేల్లో తమ పేర్లు నమోదు చేసుకుని నగదు చెల్లించి ఎరువులు తీసుకోవచ్చన్నారు. అలాగే మండలంలోని టి.చదిపిరాళ్లలో శుక్రవారం 9వ వారం పొలంబడి కార్యక్రమాన్ని ఆమె నిర్వహించి మాట్లాడారు. వరి పంటకు బ్యాక్టీరియా, ఆకు మచ్చ తెలుగు సోకిందని, దాని నివారణకు 20-25 కిలోల పొటాష్ ఎరువులను ఏకరాకు వేసుకోవాలన్నారు. అలాగే 1 గ్రాము స్ట్రెప్టో మైసిన్ సల్ఫేట్ 10 లీటర్ల నీటికి, 3గ్రాముల కాపర్ ఆక్సీ క్లోరైడ్‌ను లీటర్ నీటికి కలిపి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలన్నారు. పంట పర్యావరణ పరిశీలనలో భాగంగా చ.మీ.లో మిత్ర, శత్రు పురుగులను లెక్కించి నివారణ చర్యలు తీసుకోవాలని రైతులకు సూచించారు. మిత్ర పురుగులు ఎక్కువగా ఉండి శత్రు పురుగులు తక్కువగా ఉంటే పురుగు మందుల వాడాల్సిన అవసరం లేదన్నారు. వాతావరణాన్ని బట్టి మందులు వినియోగించాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ మమత, వెంకటకృష్ణ, రైతులు పాల్గొన్నారు. అలాగే ఎర్రగుడిపాడులో ఈ-క్రాప్ చేసిన పంటలను, సూపర్ చెక్ రికార్డులను ఆమె తనిఖీ చేశారు.



చదిపిరాళ్లలో పంట పర్యావరణను పరిశీలిస్తున్న ఏఓ సరస్వతి

# జిల్లాస్థాయి సైన్స్ సెమినార్లో విద్యార్థిని ప్రతిభ

**వేంపల్లె :** నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ మ్యూజియం వారు నిర్వహించిన జిల్లాస్థాయి సైన్స్ సెమినార్‌లో వేంపల్లె ఉషాకిరణ్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని గజ్జల హర్షిని మొదటిస్థానం సాధించి రాష్ట్రస్థాయి సెమినార్‌కు ఎంపికైనట్లు కరస్పాండెంట్ బి.ఎస్.రమణారెడ్డి తెలిపారు. చిరుధాన్యాలు పౌష్టిక ఆహారమా లేక ప్రీతికర ఆహారమా అన్న అంశంపై పులివెందులలోని రమణప్ప సత్రం బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి సైన్స్ సెమినర్‌లో ఎంపికైంది. ఈనెల 25వ తేదీన విజయవాడలో జరుగనున్న రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్‌లో హర్షిని పాల్గొననుంది. తమ విద్యార్థిని సాధించిన విజయంపట్ల కరస్పాండెంట్, ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేశారు.

## పరిసరాల పరిశుభ్రత మానవ వికాసానికి తొలిమెట్టు

**వేంపల్లె :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశానుసారంగా స్వచ్ఛభారత్‌లో భాగంగా స్థానిక వైఎస్ఆర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ 1, 2 ఆధ్వర్యంలో నిర్వహించిన పరిసరాల పరిశుభ్రతపై ర్యాలీ నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ చెరసాల యోగాంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ మల్లేశ్వరమ్మ మాట్లాడుతూ మనచుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడానికి, వాతావరణ కాలుష్యాన్ని నివారించడానికి ఇంటికి ఒక చెట్టు పెంచడానికి అందరూ సహకరించాలని విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. పట్టణ పురవీధుల్లో మొక్కలు నాటుదాం-ఊరంతా పచ్చదనం నింపుదాం అంటూ నినాదాలతో ప్రజలలో పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నాగేంద్ర, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.





ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

## ఆలయాల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

**వేముల :** గ్రామీణ ప్రాంతాల్లోని పురాతన ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగెళ్ల సాంబశివారెడ్డి, జడ్పీటీసీ కె.వెంకటబయపురెడ్డిలు తెలిపారు. మండలంలోని పెద్దజూటూరు పంచాయతీ పరిధి ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయానికి శుక్రవారం వారు భూమిపూజ చేసి మాట్లాడారు. గ్రామాల్లో పురాతన ఆలయాలకు జీర్ణోద్ధరణకు ప్రభుత్వం దేవాదాయశాఖ ద్వారా విరివిగా నిధులు మంజూరు చేస్తోందన్నారు. ఇప్పటికే మండలంలోని పలు గ్రామాల్లో నూతన ఆలయాలకు నిధులు మంజూరయ్యాయన్నారు. కొన్ని గ్రామాల్లో ఆలయ నిర్మాణ పనులు పూర్తి కావస్తున్నాయన్నారు. ఆయా గ్రామాల్లో పురాతన ఆలయాలు ఉన్నట్లెతై వాటిని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందని, గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రామచంద్రారెడ్డి, భాస్కర్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, నారాయణస్వామి, విశ్వనాథరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజలో పాల్గొన్న మండల ఇన్‌చార్జి నాగెళ్ల సాంబశివారెడ్డి తదితరులు

# పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టాలి

**కడప సెవెన్‌రోడ్స్:** ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎంఆర్‌పీఎస్ నాయకులు శుక్రవారం కలెక్టరేట్ వద్ద పికెటింగ్ నిర్వహించారు. కార్యాలయ ప్రధాన గేటు మూసివేసి బైఠాయింయారు. ఉద్యోగులు, ప్రజలు కార్యాలయ ప్రాంగణంలోకి వెళ్లకుండా కాసేపు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎం.వెంకటేష్, మహాజన సోషలిస్ట్ పార్టీ అధ్యక్షుడు చిన్నయ్య మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలనే తమ న్యాయమైన డిమాండ్ పాలకులకు పట్టడం లేదని విమర్శించారు. తాము అధికారంలోకి వస్తే వర్గీకరణ బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టి చట్టబద్ధత తీసుకొస్తామని భాజపా ఇచ్చిన హామీ విస్మరించిందన్నారు. ఈ నెల 18వతేదీ నుంచి 22వతేదీ వరకూ పార్లమెంట్ సమావేశాల్లో వర్గీకరణ బిల్లు ఊసే లేకపోవడం విచారకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు నరసింహులు, గంగరాజు, బాలయ్య, మహిళా విభాగం నాయకులు పాల్గొన్నారు.

### ఎగ్జిబిషన్ విలువ రూ.35 లక్షలకు పెంపు

**కడప కార్పొరేషన్:** కడప మున్సిపల్ మైదానంలో నిర్వహించే ఎగ్జిబిషన్ టెండర్ విలువను రూ.35 లక్షలకు పెంచుతూ నగరపాలక స్టాండింగ్ కమిటీ నిర్ణయం తీసుకుంది. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ సురేష్‌బాబు అధ్యక్షతన శుక్రవారం స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. గతంలో రూ.15 లక్షలకు వేలం పాడి టెండర్ దక్కించుకున్న ఎస్ఎస్ హ్యాండ్ లూమ్ హ్యాండీ క్రాఫ్ట్ ఫన్ ఫెయిర్ ఎగ్జిబిషన్ పెంచిన మొత్తాన్ని చెల్లించేందుకు ముందుకొచ్చింది. దీంతో వారికే అప్పగించాలని స్టాండింగ్ కమిటీ తీర్మానించింది. ఈ సమావేశంలో కేఎంసీ కమిషనర్ ప్రవీణ్‌చంద్, స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎం. సుబ్బారెడ్డి, శిరీష, మేసా ప్రమీలరాణి, వి. హేమలత, డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి, ఎస్ఈ రత్నాల రాజు, స్వామి, కరిముల్లా, డీఈలు, ఆర్ఓలు పాల్గొన్నారు.

### అంధ విద్యార్థికి అభినందన

**కడప ఎడ్యుకేషన్:** కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక విభాగం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కౌన్సిలర్ ఫర్ ఎడ్యుకేషన్ రీసర్చ్ అండ్ ట్రైనింగ్ కార్యక్రమంలో కడప ప్రభుత్వ అంధుల పాఠశాల విద్యార్థి శర్వానందరెడ్డి ప్రతిభ కనబరిచాడు. పులివెందులలో నిర్వహించిన సైన్స్ సెమినార్‌లో కన్సొలేషన్ బహుమతి సాధించారు. ఇందుకు కడప అంధుల పాఠశాల హెచ్ఎం శంకరయ్య, గైడ్ టీచర్ వెపరాల ఎబినేజర్ విద్యార్థి శర్వానంద్‌రెడ్డి అభినందించారు.

### 27న మహా ధర్నా

**కడప ఎడ్యుకేషన్:** కేజీ టు పీజీ విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 27న విజయవాడలో నిర్వహించే మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి అంకన్న కోరారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను వేంకటేశ్వర డిగ్రీ కళాశాల విద్యార్థులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

# బాల్యవివాహాలను నివారించండి

**ఎర్రగుంట్ల :** బాల్య వివాహాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మున్సిపల్ కమిషనర్ పి.జగన్నాథ్ తెలిపారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఐసీడీఎస్ పోలీస్, విద్య, వైద్య, మెప్మా అధికారులకు ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ ముంతాజ్ బేగం మాట్లాడుతూ పట్టణం పరిధిలో బాల్య వివాహాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ బాల్య వివాహాలు జరిపిస్తే వారిపై కేసు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, మెప్మా సీఓ వసంత్‌రెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ పి.జగన్నాథ్

## మహిళా బిల్లు ఆమోదంతో మహిళల్లో ఆనందం

**పులివెందుల టౌన్ :** పార్లమెంటులో మహిళా బిల్లుకు మద్దతు తెలిపిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి, ఇతర పార్లమెంట్ సభ్యులకు ప్రతి ఒక్కరికి పేరుపేరున ధన్యవాదాలు తెలుపుతున్నట్లు పులివెందుల మహిళా కౌన్సిలర్లు ధన్యవాదాలు తెలిపారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్‌హాల్ వద్ద వారు మాట్లాడుతూ పార్లమెంట్‌లో మహిళా బిల్లు ప్రవేశపెట్టక మునుపే ఏరాష్ట్రంలో లేనివిధంగా మనరాష్ట్రంలో గౌరవ ముఖ్యమంత్రి రాజకీయ పదవుల్లో, నామినేటెడ్ పదవుల్లో మహిళలకు పెద్దపీట వేశారని మహిళా అభ్యుదయంపై అసలైన చిత్తశుద్ధి ఉన్న నాయకుడని తెలిపారు. మహిళలు బాగుంటేనే రాష్ట్రం ప్రగతి పథంలో ముందుకు వెళ్లుతుందని నమ్మిన నాయకుడు అని కొనియాడారు.

ఇటువంటి నాయకుడికి వచ్చే ఎన్నికల్లో మహిళలంతా మద్దతు తెలిపి తిరిగి బంపర్ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మహిళా కౌన్సిలర్లు లక్ష్మిభార్గవి, లక్ష్మిప్రసన్న, షాహిద, శివలక్ష్మి, రాజేశ్వరి, కాంతమ్మ, గుల్జార్, రజియా, శ్యామలాదేవి తదితరులు పాల్గొన్నారు.

## విద్యా సంస్థల్లో ర్యాగింగ్‌కు పాల్పడటం నేరం

**కడప ఎడ్యుకేషన్:** విద్యా సంస్థల్లో ర్యాగింగ్‌కు పాల్పడడం చట్టరీత్యా నేరమని న్యాయసేవా అధికార సంస్థ సభ్యులు, న్యాయవాది ప్రభాకర్ అన్నారు. కడప నగర శివారులోని కేఎస్ఆర్ఎం కళాశాలలో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ర్యాగింగ్ విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపుతుందని, అలా చేస్తే శిక్షార్హులని పేర్కొన్నారు. అనంతరం టీమ్ సభ్యులతో ర్యాగింగ్ పాల్పడితే వర్తించే చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎండీ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి, ప్రిన్సిపల్ వీఎస్ఎస్.మూర్తి, కేఎల్ఎం ప్రిన్సిపల్ రత్నమ్మ, యాంటీ రాగింగ్ కమిటీ సమన్వయకర్త దుర్గాప్రసాద్, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ రాధ, న్యాయ సేవాధికార సంస్థ సభ్యులు, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న న్యాయవాది ప్రభాకర్